క్లుప్తంగా

రేపు చిత్రలేఖన పోటీలు

కడప ఎడ్యుకేషన్ : బాలబాలికల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఈ నెల 11వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు కడప నగరంలోని ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాలలో చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్లు బాలోత్సవం కన్వీనింగ్ కమిటీ సభ్యులు లక్ష్మిరాజా, రాజశేఖర్ రాహుల్ తెలిపారు. ఈ పోటీలను సర్వశిక్ష అభియాన్ జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి, ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వీర సుదర్శన్‌రెడ్డిలు ప్రారంభిస్తారని తెలిపారు. చదువుతోపాటు మానసిక ఉల్లాసం కలిగించే ఈ పోటీలో విద్యార్థులు పాల్గొనాలని కోరారు.

19న ఉచిత మెగా వైద్య శిబిరం

కడప కోటిరెడ్డిసర్కిల్ : నగరంలోని శ్రీ అక్షయ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఈనెల 19వ తేదీ ఆదివారం ఉదయం 9.00 నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు మహిళలకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు గైనకాలజిస్టు డాక్టర్ ఎ.సాగర్ కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలకు సంబంధించిన ఆరోగ్య సమస్యలను పరీక్షిస్తారన్నారు. వైద్య శిబిరంలో రక్త పరీక్షలు, గర్భిణులకు ఉచితంగా స్కానింగ్ నిర్వహిస్తామన్నారు. వివరాలకు 6281375397, 9052828677 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ముగిసిన జీపు జాతా

కడప ఎడ్యుకేషన్ : విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని రాయలసీమ స్టూడెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో నిర్వహించిన జీపుజాతా ముగిసిందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి తెలిపారు. ఈ జీపు జాతా ముగింపుసభ గురువారం కడప నగరంలోని ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాలలో ఆర్ఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రశాంత్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రవిశంకర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ హాస్టళ్లు సంక్షోభంలో ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌యూ నాయకులు హరి, శివ, మహేష్, వీరాంజనేయులు, వంశీ, రాష్ట్ర కమిటీ సభ్యుడు చరణ్ తదితరులు పాల్గొన్నారు.


గుండెపోటుతో వెటర్నరీ అటెండర్ మృతి

కడప అగ్రికల్చర్ : కడప నగర శివార్లలోని ఊటుకూరు పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్న లీలావతమ్మ గురువారం గుండెపోటుతో మృతి చెందినట్లు ఆమె కుమారుడు భాస్కర్ తెలిపారు. ఆమె కడప జేడీ కార్యాలయంతోపాటు పలు మండలాల్లో అటెండర్‌గా పనిచేశారు. లీలావతమ్మ మృతి పట్ల జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి శారదమ్మ, డీడీ వెంకటరమణ, ఏడీ శ్రీనివాసులరెడ్డి, సంఘం నాయకులు రాజశేఖర్ సంతాపం ప్రకటించారు.

పోస్టల్ చెస్ సెలక్షన్స్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కడప నగరంలో ఆంధ్రప్రదేశ్ పోస్టల్ చెస్ సెలక్షన్ ట్రైల్స్ కొనసాగుతున్నాయని, ఇందులో ప్రతిభ కనబరిచిన వారు ఆల్ ఇండియా పోస్టల్ చెస్ టోర్నమెంట్‌కు ఎంపికవుతారని కడప పోస్టల్ సూపరింటెండెంట్ రాజేష్ తెలిపారు. ఇక్కడి పోటీల ద్వారాఎంపికైన వారు డిసెంబరు 6 నుంచి 11వ తేదీ వరకు బీహార్ రాష్ట్రంలో జరిగే ఆల్ ఇండియా పోస్టల్ చెస్ టోర్నమెంట్‌కు అర్హత సాధిస్తారన్నారు. అనీస్ దర్బారి చెస్ అకాడమీలో ఈ పోటీలు ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమవుతాయన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పోస్టల్ ఉద్యోగులు ఈ టోర్నమెంట్‌లో పాల్గొంటారన్నారు.

అబుల్‌కలాం సేవలు శ్లాఘనీయం



పెన్షనర్ల సంఘం నాయకులకు అబుల్‌కలాం చిత్రపటాన్ని అందజేస్తున్న రాయల్‌కరీముల్లా

కడప ఎడ్యుకేషన్ : భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి అబుల్‌కలాం ఆజాద్ అందించిన సేవలు శ్లాఘనీయమని పెన్షనర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్మూర్తినాయుడు అన్నారు. రాయల్‌కరీం సేవా సమితి ఆధ్వర్యంలో అబుల్‌కలాం చిత్రపటాలను పెన్షనర్ల సంఘం నాయకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా దినోత్సవం సందర్భంగా ప్రతి పాఠశాలలో అబుల్‌కలాం జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్‌కే సేవా సమితి అధ్యక్షుడు రాయల్‌కరీముల్లా, పెన్షనర్ల సంఘం నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చెస్ టోర్నమెంట్‌కు విద్యార్థిని ఎంపిక



జాహ్నవి

కమలాపురం : మండల పరిధిలోని పెద్ద చెప్పలి జడ్పీ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న జాహ్నవి రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీఎల్‌పి సునీల్ కుమార్ తెలిపారు. మంగళవారం కడప నగరంలో మున్సిపల్ ఉర్దూ హైస్కూల్‌లో జరిగిన జిల్లాస్థాయి చెస్ పోటీలకు ఎంపికైన జాహ్నవి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ తెలిపారు. 11న విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటుందన్నారు.

మన పిల్లల భవిష్యత్తు కోసం జగనే మళ్లీ రావాలి



ఎర్రముక్కపల్లెలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



పాతకడప సచివాలయంలో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు

- 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో పార్టీ నాయకులు

కడప కార్పొరేషన్ : మన పిల్లల భవిష్యత్తు కోసం మళ్లీ జగనే ముఖ్యమంత్రిగా రావాలని వైఎస్సార్ సీపీ క్లస్టర్ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి, 19వ డివిజన్ ఇన్‌చార్జి లక్ష్మయ్య అన్నారు. గురువారం స్థానిక ఎర్రముక్కపల్లెలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో భాగంగా వార్డు సచివాలయ పరిధిలో వారు వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరించారు. సచివాలయంలో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి బుక్‌లెట్ అందజేసి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ఈ పథకాల వల్ల ప్రతి ఇంటికీ లక్షల రూపా యల్లో లబ్ధి జరిగిందని, చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రజలకు మేలు చేయాలన్న ఆలోచన చేయలేదని వివరించారు. గురువారం రాత్రి అక్కడే బస చేసి స్థానిక ప్రజలతో మమేకమయ్యారు. ఈ కార్యక్రమంలో 19వ డివిజన్ కార్పొరేటర్ శిరీష, పార్టీ నాయకులు ఎన్. సుబ్బారెడ్డి, బంగారు నాగయ్య, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పాతకడపలో..

1వ డివిజన్‌లోని పాతకడపలో గురువారం సాయంత్రం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. 1/2 సచివాలయ పరిధిలో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డు, పార్టీ జెండాను ఆవిష్కరణ చేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి బుక్‌లెట్ అందజేసి జగన్ మళ్లీ సీఎం కావాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ జిల్లా కో ఆర్డినేటర్ పోతుల శివారెడ్డి, 1వ డివిజన్ కార్పొరేటర్ ఆర్. చెన్నయ్య, 30వ డివిజన్ కార్పొరేటర్ షఫీ, కో ఆప్షన్ సభ్యుడు హరూన్ బాబు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతి ప్రదానం



విద్యార్థికి బహుమతి ప్రదానం చేస్తున్న మను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అబ్దుల్ ముఖ్సిత్‌ఖాన్

కడప ఎడ్యుకేషన్ : మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి వారోత్సవాల్లో భాగంగా కడప నగరంలోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి మను పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అబ్దుల్ ముఖ్సిత్‌ఖాన్ బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ మొదటి కేంద్ర విద్యాశాఖ మంత్రిగా విద్యలో ఎన్నో సంస్కరణలు తెచ్చారన్నారు. అలాగే స్వాతంత్ర ఉద్యమంలో ఆయన పాత్ర శ్లాఘనీయమన్నారు. అలాంటి మహోన్నత వ్యక్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు విలయత్‌అలీ, ఖాజామొయినుద్దీన్, సికిందర్ హుస్సేన్, నసార్, షాయఖ్‌తోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

యానిమేషన్ రంగానికి మంచి డిమాండ్

- వైఎస్ఆర్ ఏఎఫ్‌యూ వీసీ ఆచార్య ఆంజనేయప్రసాద్
- ఘనంగా యానిమేషన్ ఎగ్జిబిషన్ వేడుకలు



ఎమిలీ కోలి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వీసీ, రిజిస్ట్రార్ ఆచార్య, అధ్యాపకులు

ఏఎఫ్‌యూ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో యానిమేషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో యానిమేషన్ ఎగ్జిబిషన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన వైస్ చాన్సలర్ ఆచార్య బానోతు ఆంజనేయప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రదర్శనను ప్రారంభించారు. యానిమేషన్ పితామహుడు ఎమిలీ కోలీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ మార్కెట్‌లో చక్కటి డిమాండ్ ఉన్న యానిమేషన్ కోర్సు విశ్వవిద్యాలయంలో ప్రవేశపెట్టడం ఈ ప్రాంత విద్యార్థులకు దక్కిన వరమన్నారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ వీడియోగేమ్‌లు, సినిమాలు, అద్భుతమైన కళారూపాల్లో యానిమేషన్ వినియోగంతో కొత్త పుంతలు తొక్కుతోందన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన 2డీ, 3డీ వీఎఫ్ఎక్స్ వర్క్‌లను చూసి అభినందించారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్ రెడ్డి, యానిమేషన్ కోఆర్డినేటర్ కె. శాంతి, అధ్యాపకులు రవికుమార్, విద్యానంద్, సావిత్రి, శివకృష్ణారెడ్డి, దినేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

దూదేకుల సమస్యలపై వినతి



పురందేశ్వరికి వినతిపత్రం ఇస్తున్న దూదేకుల సంఘం నాయకులు

కడప కల్చరల్ : తమ సమస్యలపై రాష్ట్ర దూదేకులు, నూర్‌బాష సంక్షేమ సంఘం ప్రతినిధులు గురువారం రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరికి విన్నవించారు. జిల్లా పర్యటనలో భాగంగా కడప నగరానికి వచ్చిన ఆమెకు ఈ మేరకు దూదేకుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గగ్గుటూరి చిన్నరాజ మాట్లాడుతూ సినిమాలోనూ, టీవీ, సీరియళ్లు, కామెడీ షోలలో పింజారీ వెధవల్లారా అని సంబోధించడం సరైన పద్ధతి కాదని వివరించారు. స్పందించిన పురందేశ్వరి మాట్లాడుతూ నూర్బాష, దూదేకుల సమస్యలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దృష్టికి తీసుకెళ్లి తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు ఖాదర్ బాషా, హుస్సేన్, ఓబులేసు, కమల్ బాషా, కుళాయప్ప, మహమ్మద్, బాబు తదితరులు పాల్గొన్నారు.

పుష్పగిరి క్షేత్ర అభివృద్ధికి సహకరించండి

కడప కల్చరల్ : పుష్పగిరి క్షేత్ర అభివృద్ధికి సహకరించాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిని జిల్లాకు చెందిన న్యాయవాది సట్టి భారవి, పుష్పగిరి క్షేత్ర ధర్మ పరిరక్షణ సేన సభ్యులు కోరారు. గురువారం ఆమె కడపలో పర్యటించిన సందర్భంగా ఆమెను కలిసి ఈ మేరకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ క్షేత్రం అభివృద్ధి కోసం కేంద్ర పర్యాటకశాఖ ద్వారా రూ. 40 కోట్ల నిధులను విడుదల చేయాలని కోరారు. స్పందించిన పురందేశ్వరి ఈ అంశాన్ని కేంద్ర పర్యాటకశాఖ మంత్రి దృష్టికి తీసుకెళతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు భాస్కర, సత్యనారాయణ గాంధీ, వరప్రసాద్, మునగా సతీష్ పాల్గొన్నారు.


జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న జూనియర్ ఎంప్లాయ్‌మెంట్ అధికారి దోనప్ప

కడప కోటిరెడ్డిసర్కిల్ : నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే ఉద్దేశంతో నిర్వహిస్తున్న జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ ఎంప్లాయ్‌మెంట్ అధికారి దోనప్ప తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో నిరుద్యోగ యువతకు జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు ప్రముఖ కంపెనీలు హాజరయ్యాయన్నారు. మొదట చిన్న ఉద్యోగమైనా చేరి తర్వాత అంచెలంచెలుగా ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. 62 మంది అభ్యర్థులు హాజరయ్యారని, వారిలో అర్హత, అనుభవాన్ని బట్టి 21 మందిని ఎంపిక చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ కంపెనీల ప్రతినిధులు, ఉపాధి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వక్ఫ్ అద్దెలు నిగ్గు తేల్చాలి



వక్ఫ్ ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఇన్సాఫ్ నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : కడప నగరం యాకుబ్‌సాహెబ్ మసీదు వక్ఫ్‌బోర్డు స్థలంలో నిర్మించిన గదుల బాడుగలు ఎక్కడికి వెళుతున్నాయో నిగ్గుతేల్చాలని ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు కేసీ బాదుల్లా, సహాయ కార్యదర్శి ఎస్.గౌస్, నగర కార్యదర్శి మైనుద్దీన్‌లు డిమాండ్ చేశారు. గురువారం వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ వసీం అక్రమ్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. మసీదు కమిటీ, కన్‌స్ట్రక్షన్ కమిటీల పేరుతో సుమారు 60 రూములు పైబడి నెలవారి బాడుగల రూపంలో వసూళ్లు చేస్తున్న డబ్బులు వక్ఫ్‌బోర్డుకు చెందకుండా ఎక్కడికి వెళుతున్నాయో విచారణ చేపట్టాలని కోరారు. స్థానికంగా ఉన్న కమిటీలు ఆడిటింగ్ నిర్వహించకుండా, రాబడుతున్న బాడుగలు చూపించకుండా నామమాత్రపు అద్దెలు చూపుతూ వక్ఫ్‌బోర్డును మోసం చేస్తున్నారని ఆరోపించారు. బాడుగలు, గదుల సంఖ్య విషయంలో పత్రికలు, సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న అసత్య ప్రచారాలకు అడ్డుకట్ట వేయాలని కోరారు.

ఉచితంగా న్యాయ సేవలు పొందవచ్చు

కమలాపురం : పేద ప్రజలు, ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న వారు జాతీయ లీగల్ సర్వీసు కమిటీ ద్వారా ఉచితంగా న్యాయ సేవలు పొందవచ్చని కమలాపురం జూనియర్ సివిల్ కోర్టు మెజిస్ట్రేట్ లావణ్య తెలిపారు.

గురువారం జాతీయ న్యాయ సేవా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక కోర్టు ఆవరణలో ఉచిత న్యాయ సేవల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1987లో పార్లమెంటులో న్యాయ సేవల ప్రాధికార చట్టాన్ని చేసిందన్నారు. అనంతరం 1995 నవంబర్ 9న ఈ చట్టాన్ని ప్రభుత్వం అమల్లోకి తెచ్చిందన్నారు. అప్పటి నుంచి ఆర్థిక స్తోమతలేని పేద ప్రజలకు ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేయడంతో పాటు న్యాయ సేవలు పొందే హక్కు ఏర్పడిందన్నారు. ప్రజలు ఈ ఉచిత సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో న్యాయ వాదులు, ప్రజలు పాల్గొన్నారు.

రైతులకు ఈ క్రాప్ నమోదు పత్రాల పంపిణీ

వల్లూరు : మండలంలో 2023 ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసి ఈ క్రాప్ నమోదు చేయించుకున్న రైతులందరికీ ఈ క్రాప్ నమోదు ధృవీకరణ పత్రాలను అందచేస్తున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి సాయిజ్యోతి తెలిపారు. మండలంలోని లేబాక గ్రామ సచివాలయ పరిధిలో గురువారం ఆమె పర్యటించారు. అనంతరం స్థానిక రైతు భరోసా కేంద్రంలో రైతులకు ఈ క్రాప్ నమోదు ధృవీకరణ పత్రాలను పంపిణీ చేశారు. రైతులు సంబంధిత రైతు భరోసా కేంద్రాల్లోని వ్యవసాయ శాఖ సిబ్బందిని సంప్రదించి ధృవీకరణ పత్రాలను పొందాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ సుబ్బనరసయ్య, గ్రామ వ్యవసాయ సహాయకులు దొరబాబు, రైతులు పాల్గొన్నారు.

భగవద్గీత పఠనాన్ని అలవరచుకోవాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శాస్త్రీనగర్‌లోని శివదర్శనానంద సరస్వతీ మాతాజీ ఆశ్రమంలో గురువారం విద్యార్థులకు జిల్లా స్థాయి భగవద్గీత పఠన పోటీలను నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు భగవద్గీతలోని 4వ అధ్యాయం జ్ఞానకర్మసన్యాస యోగ అంశంపై పఠన పోటీలు జరిపారు. ఈ సందర్భంగా శివదర్శనానంద సరస్వతీ మాతాజీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భగవద్గీత చదవాలన్నారు. దీని వల్ల మంచి,చెడు, విచక్షణ జ్ఞానం తెలుస్తుందని, సంస్కారం అలవడుతుందని వివరించారు. గెలుపొందిన వారికి జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను అందించనున్నట్లు ఆమె తెలిపారు. ఈ పోటీలకు డాక్టర్ మూలె రామునిరెడ్డి, సుబ్బిరెడ్డి, పల్లా నరసింహులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ఏ-కేటగిరిలో సాత్వికరెడ్డి (సాయిరవీంద్ర), బి-కేటగిరిలో పర్వేష్ (సరోజిని), సి-కేటగిరిలో అక్షయ (రవీంద్రహైస్కూల్), డి-కేటగిరిలో వీర షణ్ముఖచక్రి (బాలతత్సంగం), ఈ-కేటగిరిలో విశాలాక్షి (ఆదిత్య)లు ప్రథమ స్థానంలో నిలిచారు. కార్యక్రమంలో ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లేటి ప్రభాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏక్‌భారత్.. శ్రేష్ట భారత్ క్యాంపులో ప్రతిభ



ఎన్‌సీసీ కేడెట్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఎన్‌సీసీ అధికారులు

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల ఎన్‌సీసీ కేడెట్ అభిరామ్ అక్టోబర్ 25 నుంచి నవంబర్ 5వ తేదీ వరకు పంజాబ్‌లో నిర్వహించిన ఏక్‌భారత్.. శ్రేష్ఠభారత్ క్యాంపులో పాల్గొని చక్కటి ప్రతిభ కనబరిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. రవీంద్రనాథ్ తెలిపారు. క్యాంపులో ఆంధ్రప్రదేశ్ నుంచి పాల్గొన్న అభిరామ్ ఒక స్వర్ణపతకం, రెండు రజత పతకాలను సాధించినట్లు తెలిపారు. జాతీయ క్యాంపులో చక్కటి ప్రదర్శన కనబరిచిన విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. రమేష్, ఎన్‌సీసీ అధికారులు డాక్టర్ ఆర్. నీలయ్య, డాక్టర్ మహేష్, తెలుగుశాఖ విభాగాధిపతి సుందరేశ్వర్ పాల్గొన్నారు.

గర్భిణులు క్రమం తప్పక పరీక్షలు చేయించుకోవాలి



గర్భిణికి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ప్రశాంత్‌వర్ధన్

కడప కోటిరెడ్డిసర్కిల్ : గర్భం దాల్చిన మహిళలు తొమ్మిదో నెల వరకు క్రమం తప్పక పరీక్షలు చేయించుకోవాలని అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు డాక్టర్ ప్రశాంత్ వర్ధన్ తెలిపారు. గురువారం ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్‌ను పురస్కరించుకుని నాగరాజుపేటలోని అంగన్వాడీ కేంద్రంలో హెల్త్ ఎడ్యుకేటర్ ఆర్.ప్రసన్నలత ఆధ్వర్యంలో 15 మంది గర్భిణులకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులకు ఉచితంగా స్కానింగ్ చేస్తారన్నారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ వందన యోజనలో మొదటి విడతగా రూ. 3 వేలు ఇస్తారన్నారు. రెండవ విడత 14 వారాల వయస్సుకు ఇవ్వాల్సిన టీకాలు వేయించిన తర్వాత రూ. 2 వేలు ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ వైద్యులు, హోమియో వైద్యులు, సూపర్‌వైజర్ గుల్జార్‌బేగం తదితరులు పాల్గొన్నారు.

నేడు సీపీ బ్రౌన్ జయంతి సభ

కడప కల్చరల్ : తెలుగుభాషోద్ధారకుడు సీపీ బ్రౌన్ 225వ జయంతి ఉత్సవాన్ని స్థానిక బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఆ కేంద్రం సంచాలకులు ఆచార్య తప్పెట రామప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఉదయం 9.40 గంటలకు రాజీవ్ మార్గ్‌లోని బ్రౌన్ విగ్రహానికి పూలమాలలు అలంకరించి నివాళులర్పిస్తారన్నారు. అనంతరం బ్రౌన్ గ్రంథాలయంలో నిర్వహించనున్న సభకు యోగి వేమన విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య చింతా సుధాకర్ ముఖ్య అతిథిగా, వెంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య రాణి సదాశివమూర్తి విశిష్ట అతిథిగా, వైవీయూ కుల సచివులు ఆచార్య వైపీ వెంకట సుబ్బయ్య గౌరవ అతిథిగా పాల్గొంటారన్నారు. ప్రధాన వక్తలుగా రాయలసీమ ఉద్యమకారుడు భూమన్ లండన్‌లో సీపీ బ్రౌన్ స్మారక చిహ్నాలు అంశంపైన, హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యాపకులు ఆచార్య దేవారెడ్డి విజయలక్ష్మి నిఘంటు నిర్మాణం-సీపీ బ్రౌన్ కృషి అనే అంశంపై ప్రసంగిస్తారన్నారు. ఈ సందర్భంగా నందారపు చెన్నకృష్ణారెడ్డి వేమన పద్యధార గానం చేస్తారని, సభ ప్రారంభంలో సీపీ బ్రౌన్ లఘు నాటిక ప్రదర్శన ఉంటుందని తెలిపారు. మధ్యాహ్నం 2.00 గంటలకు జడ కోలాటం, 3.30 గంటలకు కత్తి, కర్రసాము, సాయంత్రం 5.00 గంటలకు తోలు బొమ్మలాట ప్రదర్శన ఉంటాయని వివరించారు.

కేఎస్ఆర్ఎంలో వాలీబాల్ ఎంపికలు



మాట్లాడుతున్న జేఎన్‌టీయూ స్పోర్ట్స్ సెక్రటరీ కౌన్సిల్ జోజిరెడ్డి

కడప ఎడ్యుకేషన్ : కేఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి అనంతపురం జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వ విద్యాలయం(జేఎన్‌టీయూ) పరిధిలోని పలు ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన విద్యార్థులకు సౌత్ జోన్ మెన్, ఉమెన్ వాలీబాల్ ఎంపికలను నిర్వహించారు. ఈ పోటీలను జేఎన్‌టీయూ స్పోర్ట్స్ సెక్రటరీ కౌన్సిల్ జోజిరెడ్డి ప్రారంభించారు. కడప కేఎస్ఆర్ఎం కళాశాల నుంచి మెన్, ఉమెన్ జట్లు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ వీఎస్ఎస్‌మూర్తి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జోజిరెడ్డి మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. విశ్వవిద్యాలయం స్థాయి వాలీబాల్ పోటీలను తమ కళాశాలలో నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి అన్నారు. ఎంపికైన జట్లను ఎండీ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డితోపాటు కళాశాల ప్రిన్సిపాల్ వీఎస్ఎస్‌మూర్తి, ఫిజికల్ డైరెక్టర్ నారాయణ, వంశీనాయక్‌లు అభినందించారు.

ఈనెల 29 నుంచి పీఎస్‌యూ రాష్ట్ర మహాసభలు



రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పీఎస్‌యూ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమ ప్రణాళిక రూపొందించుకోవడం కోసం నెల్లూరు నగరంలో పీఎస్‌యూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెండవ మహాసభలను ఈ నెల 29, 30 తేదీలలో నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రెసివ్ స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను గురువారం కడపలోని కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సమావేశంలో పీఎస్‌యూ రాష్ట్ర కమిటీ సభ్యులు నాగేంద్ర, గోపీ, హరికృష్ణారెడ్డి, శ్రీను, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

హుస్సేన్ వలీ దర్గా మండపానికి భూమి పూజ



దర్గా మండపానికి భూమిపూజ చేస్తున్న సీకేదిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి

పెండ్లిమర్రి : మండలంలోని మొయిళ్లకాల్వ గ్రామంలో వెలసిన నారాయణస్వామి హజరత్ హుస్సేన్‌వల్లి దర్గా నూతన మండపంకు గురువారం సీకేదిన్నె జెడ్పీటీసీ పి.నరేన్‌రామాంజులరెడ్డి భూమి పూజ చేశారు. మండపం నిర్మాణంకు నరేన్‌రామాంజుల రెడ్డి రూ.లక్ష విలువ చేసే స్టీల్ ఉచితంగా ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. దర్గాకు ఉచితంగా స్టీల్ అందించినందుకు ఆలయ కమిటీ సభ్యులు శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, సింగల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కృష్ణారెడ్డి, హుస్సేన్, వెంకటసుబ్బారెడ్డి, సుబ్బారెడ్డి, పాల్గొన్నారు.

చెప్పిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత జగనన్నదే



కమలాపురం : సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : ఎన్నికల మెనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత సీఎం జగనన్నదేనని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. బుధవారం సంబటూరులో నిర్వహించిన ఏపీకి జగనే ఎందుకు కావాలి? కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముందుగా ఆ సచివాలయం పరిధిలో అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, రైతు భరోసా, ఆసరా, చేయూత తదితర పథకాల ద్వారా లబ్ధి చేకూరిన రూ.20.54 కోట్ల వివరాల తెలిపే బోర్డును అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలసి ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల మెనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్ని నెరవేర్చిన ఘనత జగనన్నదేనన్నారు. చంద్రబాబు వేల హామీలిచ్చి ఒక్కటి నెరవేర్చలేదన్నారు. తన పాలన ద్వారా లబ్ధి చేకూరితేనే ఓటు వేయమని జగనన్న కోరుతున్నాడని వివరించారు. ఒక్క సంబటూరు సచివాలయం పరిధిలోనే 20.54 కోట్లు ప్రజలకు డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా చేరిందన్నారు. 2012లో ఎంపీ నిధుల ద్వారా తాను సంబటూరు గ్రామానికి పైప్ లైన్ వేశానని, ఆ నీరే మీరు ఇప్పటికి తాగుతున్నారని గుర్తు చేశారు. తాము అధికారంలోకి వచ్చాక చెన్నంపల్లెలో రూ.60 లక్షలతో సీసీ రోడ్లు వేశామన్నారు. ప్రధాన రహదారి నుంచి చెన్నంపల్లెకు లింక్ రోడ్డు వేశామన్నారు. పెద్ద వంక పై రూ.7లక్షలతో కల్వర్ట్ నిర్మించామన్నారు. కోటి రుపాయల వ్యయంతో సచివాలయం, ఆర్‌బీకే, విలేజ్ క్లినిక్, వాటర్ ప్లాంట్ నిర్మించామన్నారు. మొలకవారిపల్లెలో రూ.13 లక్షలతో సీసీ రోడ్లు వేశామన్నారు. సంబటూరు-విభరాపురం, ఖాజీపేట రోడ్డు రూ. 3.28కోట్లతో రోడ్డు పనులు జరుగుతున్నాయని, సంబటూరు, మొలకవారిపల్లెలో ఇంకా సీసీ రోడ్లు, డ్రైన్స్ వేయాల్సి ఉన్నాయన్నారు. గ్రామంలోని ఆలయాలకు దూపదీప నైవేద్యాలు అందించడతో పాటు టీటీడీ ద్వారా విగ్రహాలు పంపిణీ చేశామన్నారు. అలాగే ఎస్సీ కాలనీలో రూ. 10లక్షలతో రామాలయం నిర్మించాల్సి ఉందన్నారు. అనంతరం వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే వారం రోజుల పాటు ఇంటింటికి వెళ్లి ఈ కార్యక్రమం గురించి ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో హార్టికల్చర్ స్టేట్ అడ్వైజర్ సంబటూరు ప్రసాద్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ ఎన్‌సీ పుల్లారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు రాజుపాళెం సుబ్బారెడ్డి, ఎంపీపీ భారతి, వైస్ ఎంపీపీ చెన్నకేశవరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ సాదిక్, కోఆప్షన్ సభ్యుడు ఇర్ఫాన్, అధికారులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులకు భూమి పూజ

చెన్నూరు : స్థానిక కొత్త రోడ్డులో రెండో వైపు డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, సీకేదిన్నె జడ్పీటీసీ రామాంజులరెడ్డిలు గురువారం భూమిపూజ చేసి మాట్లాడారు. చెన్నూరు టౌన్ కొత్త రోడ్డు నుంచి వనం వీధి వరకు కొద్దినెలల కిందట రూ.70 లక్షలతో రోడ్డు నిర్మాణం వేశారు. ఒకవైపు డ్రైనేజీ పనులు చేపట్టారు. అలాగే రెండో వైపు రూ.28.50 లక్షలతో డ్రైనేజీ పనులకు భూమి పూజ చేశామన్నారు. కార్యక్రమంలోఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, మండల కన్వీనర్ జీయస్‌భాస్కర్‌రెడ్డి, సొసైటీ ప్రెసిడెంట్ అల్లి శ్రీరామ్మూర్తి, టౌన్ కన్వీనర్ ముదిరెడ్డి సుబ్బారెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.